
# అమ్మ కడుపు చల్లగా...

కథ

- అరిగే రామారావు



ఈ రోజు జానకి రామయ్య, జానకమ్మ గార్ల పెళ్లిరోజు.

డిసెంబరు తొమ్మిది, ఆదివారం.

నలభై అయిదు వసంతాల సహజీవన గమనం;

ఏడడుగులతో మొదలైన అలుపెరగని పయనం;

జీవన సంధ్య నిశ్శబ్దంగా కుంగుతున్న సమయం.

ఎక్కడో ఖండాంతరాల్లో వుంటున్న చిన్న కొడుకు.

లేటుగా నిరుడే

పెళ్లి చేసుకుని విశాఖపట్నంలో ఉంటున్న

చిన్న కూతురు.

ఇదే వూళ్లో, ఇదే ఇంట్లో కింద వున్న పోర్షన్లలో

వేరు వేరు కాపురాలు

పెట్టుకుని వుంటున్న పెద్దకొడుకులిద్దరూ.

ఇంటి పై భాగంలో రెండు గదులు వేసుకుని నెలా నెలా వచ్చే పెన్షన్ డబ్బుల్తో, విడిగా ఇంత వుడకేసుకుని తింటూ, కృష్ణా రామా అనుకుంటూ, వారి మానాన వారు కాలం గడుపుతున్న వృద్ధ దంపతులు.

వచ్చిపోయిన ఎన్నో పెళ్లిరోజుల్లాగే ఇది మరో పెళ్లి రోజు. కన్నవారయినా, వారు కట్టుకున్న వార యినా, వీరు కన్న పిన్నవారయినా మొక్కుబడిగా పొడిపొడిగా చెప్పే గ్రీటింగ్స్...

ఈ రోజు కూడా గత పెళ్లిరోజుల్లాగే నామమా త్రంగా, సాదాసీదాగా గడిచిపోవలసిన రోజే! ఆఖరికి ఈ రోజు ఉదయం పదిగంటలకు కూడా అలాగే గడిచింది! ఎటొచ్చీ పదిన్నర నుంచి రసవత్త రంగా, రమ్యంగా మలుపు తిరిగింది. దీనికి సూత్ర ధారి అమెరికాలో వుంటున్న చిన్న కొడుకు నరేష్. అందుకే ఈ కథ...

టైం పదిన్నరయింది. ఫోను దీర్ఘంగా మోగింది. ఇంటర్నేషనల్ కాల్. అమెరికా నుంచి చిన్న కొడుకు. కొడుకు, కోడలు, మనవలూ వీరికి హేపీ మేరేజ్ డే గ్రీటింగ్స్ చెప్పారు.

నరేష్, ''మమ్మీ! మీ మేరేజ్‌ని ఎలా సెలబ్రేట్ చేస్తోన్నారు?'' నవ్వుతూ, సరదాగా అడిగాడు.

''ఏం వుంది నాయనా! ప్రతి యేడు లాగే మీ నాన్న వూళ్లోని గుళ్లూ గోపురాలన్నీ తిప్పించి అభిషే కాలూ, అష్టోత్తరాలూ చేయించి ఇదిగో ఇప్పుడే ఇంటికి తీసుకొచ్చారు. తిరిగి తిరిగి శోష వచ్చి ఇదిగో ఇలా కూలబడ్డా. ఇంతలోకి మీ ఫోను!'' నీర సంగా అంది.

''ఒక ఆటోనన్నా ఎంగేజ్ చేసుకోపోయారా మమ్మీ''

''అయ్యో రాతా! ఎక్కే బస్సూ, దిగే బస్సూ. చిల్లర పైసల దగ్గర వాళ్లతో ఈయనగారి పేచీలూ! అడగొద్దురా తండ్రీ!''

అవతల్నుంచి నవ్వులు.

''ఈరోజు మీ లంచ్ ప్రోగ్రాం ఏంటత్తయ్య గారూ?'' అమెరికా కోడలు నవ్వుతూ అడిగింది.

''ఒకటే ప్రోగ్రాం తల్లీ! ఇప్పుడు ఎసట్లో బియ్యం పోసుకోవాలి. కింద నుంచి కోడళ్లు కూరలు పంపిస్తామన్నారు''

''ఏంటమ్మా ఇది. మీరన్నం వండుకోవడం, వదిన వాళ్లు కూరలు పంపడం! ఈ రోజన్నా మీరు సరదాగా బయటకెళ్లి భోం చెయ్యవచ్చుగా! సరే, మీ మేరేజ్‌కి ఈ రోజు మీ ఇద్దరికీ నేనొక సర్‌ప్రైజ్ గిఫ్టు ఇస్తా'' నవ్వుతూ అన్నాడు.

చిన్న కొడుకు చాలా సరదాగా, సంతోషంగా వున్నాడు. కొడుకు కోడలు ఇద్దరూ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. నాలుగు చేతులా సంపాదిస్తున్నారు. ఈ మధ్యనే న్యూజెర్సీలో సొంత ఇల్లు కూడా కొన్నారు. పైగా నాలుగు రోజుల క్రితమే నరేష్‌కి ప్రమోషన్ వచ్చింది. అందుకే చాలా హేపీగా, వుత్సాహంగా హైమూడ్స్‌లో వున్నాడు.

''నాన్న ఏం చేస్తోన్నారు? మాటాడమను!'' అన్నాడు.

''అదిగో నట్టింట కూర్చుని గుళ్లల్లో తీసుకొ చ్చిన కుంకుమ పొట్లాలు, విబూది పొట్లాలూ విప్పి వేటికవి సీసాల్లో పోస్తున్నారు. మిమ్మల్నే! చిన్నో డితో మాటాడండీ'' అంది.

''వింటున్నారా అబ్బీ, అంతా వింటున్నా. నువ్వు స్పీకరుగట్రా వున్న ఫోన్ సెట్టొకటి పంపించావుగా! దాంట్లోంచి మీ మాటలన్నీ వినిపి స్తోన్నాయి'' తాపీగా అన్నారు.

''డాడీ! మీ ఇద్దరికీ నేనొక ప్రోగ్రాం ఫిక్స్ చేశా! మమ్మీని అక్కడికి తీసుకెళ్లండి''

''ప్రోగ్రాం ఏంటీ! ఎక్కడికి తీసుకెళ్లాలి?''

''అన్నీ ముందే చెప్పేస్తే థ్రిల్లింగ్ వుండదు. హేవ్ ఎ నైస్ టైం. ఒకే! బై మమ్మీ! బై డాడీ'' ఫోన్ కట్ అయిపోయింది.

అమెరికాలో వుంటున్న కొడుకు అమ్మా నాన్న లకు సరదాగా ఇచ్చే ఈ సర్‌ప్రైజ్ గిఫ్ట్ పాపం ఆ ముసలి వాళ్లకు లేనిపోని తిప్పలు తెచ్చి పెట్టింది; ఆ ఇంట్లో కలకలం రేపింది!

* * *

ఫోను మోగింది, ఆ ఫోనుతోనే ఈ రోజు ఆ ఇల్లంతా పెద్ద'మోత' మోగిపోయింది. ఈ ముసలా ళ్లకు మనశ్శాంతి లేకుండా చేసింది. జానకమ్మ ఫోను అందుకుంది. సికింద్రాబాద్ శివార్లల్లో వుండే సెలెబ్రిటీ హాలిడే రిట్రీట్‌వారు ఫోన్ చేశారు.

జానకి రామయ్య, జానకమ్మ గార్ల కోసం వాళ్ల హాలీడే రిట్రీట్‌లో ఒక డీలక్స్ రూమ్ అమెరికా నుంచి బుక్ చేయబడిందట. మీరే టైంలో వచ్చి రూంలో చేరతారంటూ ఎంక్వయిరీ చేస్తోన్నారు. జానకమ్మ గారు అవాక్కయ్యారు. నోట మాట పెగ ల్లేదు. మాకేంటీ, డీలక్స్ రూం బుక్ చేయడం ఏంటీ? ఈ చిన్నాడికి మతిగానీ పోలేదు కదా! ఎంత అమెరికాలో వుంటే మాత్రం, అక్కడి పద్ధ తులు ఎంత వంటబడితే మాత్రం ఈ ముసలి అమ్మానాన్నల పెళ్లిరోజుకు హోటల్లో రూమ్ బుక్ చేస్తాడా? ఈ కొంటె వెధవ మాకు సర్‌ప్రైజ్ గిఫ్టు ఇస్తానంది ఇదా?..అవ్వా! అని నోరు నొక్కేసుకుంది.


కానీ, జానకిరామయ్య గారి పరిస్థితి వేరే విధంగా వుంది. ఆమె నోరు నొక్కుకుంటుంటే ఈయనగారి నోట్లోంచి సనసన్నగా ఈలపాటా, కులాసాగా కూనిరాగం వస్తోంది. లోపల్నుంచి హుషారు తన్నుకొస్తోంది.

భార్య చేతిలోంచి జోషుగా ఫోను వూడబెరు క్కున్నారు. ఆమె వారిస్తోన్నా వినకుండా అదే జోషులో రపాతపా ఇంగ్లీషులో దంచేశారు. ఇరవై నిమిషాల తర్వాత మళ్లీ వాళ్లు ఫోన్ చేస్తే, తాము ఏం టైంకు రూమ్‌కు వచ్చేది చెబుతామన్నారు. ఆ తర్వాత ఆయనగారి అసలు వీరంగం మొదలైంది. సజ్జపై వున్న సూట్‌కేసును కిందకు దింపారు. దాని దుమ్ము దులిపారు. తన బట్టలూ, టూత్‌బ్రష్, షేవింగ్ బాక్సూ, తన మందుల డబ్బా గట్రా సర్దటం మొదలెట్టారు. మాటిమాటికి చేతీ వాచీ చూసుకుంటున్నారు. ''ఇంకా నీవట్టా కూర్చున్నా వేంటీ కొత్త పెళ్లికూతురా? నీ చీరెలు గట్రా సర్దుకో'' అంటూ జానకమ్మ గారిని హడావుడి పెట్టసాగాడు.

ఈ సమాచారం కింద వుండే కొడుకులూ కోడ ళ్లకూ, వాళ్ల పిల్లలకూ, ఆ కాలనీలో వుండే జనాలకు తెలిసిపోయింది. పోలోమంటూ అందరూ పైకి వచ్చేశారు. నవ్వుకుంటూ జోకులు వేసుకుంటూ ఈ వృద్ధ దంపతులకు కంగ్రాట్స్ చెప్పసాగారు.

కోడళ్లయితే ముసిముసి నవ్వులు నవ్వుతూ, ''కంగ్రాట్స్ అత్తయ్యగారూ, మావయ్యగారూ! మీరు హనీమూన్ కెళ్తున్నారంటగా! మీ మేరేజీడేని బాగా ఎంజాయ్ చెయ్యండి'' ఎగతాళిగా అన్నారు.

''మా మొఖాలకెటూ లేదు. మీరన్నా సరదాగా



గడపండి!'' వాళ్ల మొగుళ్ల వంక చూస్తూ, పమిట చెంగుల్ని గట్టిగా విదిలించి, విసవిసా నడుచుకుంటూ బాల్కనీలోకి వెళ్లి గుసగుసలు మొదలు పెట్టారు. ఆ మొగుళ్ల ఒకళ్ల మొఖాలు ఒకళ్లు చూసుకున్నారు.

జానకమ్మగారయితే తల పట్టుకుని కూర్చున్నారు. ఈ చిన్న సన్నాసి పున్నోడు వుండడు. ఏదో ఒక కుమ్మరాం తీసుకొచ్చి నెత్తి మీద పెడుతుంటాడు అనుకుంది.

చిన్న పిల్లలయితే ఒకటే గొడవ. ''మమ్మీ, మమ్మీ! మేమూ వెళ్తాం. అక్కడ స్విమ్మింగ్‌పూల్ వుంటుందట. మేమందులో స్విమ్మింగ్ చేస్తాం''

''అక్కడ చాలా గేమ్స్ వుంటాయంట. మేం అక్కడ షటిల్ ఆడుకుంటాం''

''మేం క్రికెట్టు ఆడుతాం'', ''మేం ఫుట్‌బాల్ ఆడుతాం'' ''మేమూ వెళ్తాం మమ్మీ! నానమ్మా! మీతో పాటు మమ్మల్నీ తీసుకెళ్లండీ! ప్లీజ్ నానమ్మా!''

చిన్న కోడలయితే డ్యాన్సు టీచరేమో, బొటన వేలుకు, చూపుడు వేలు జతచేసి నాట్య ముద్ర పట్టి, ''ఓన్లీ న్యూలీ మేరీడ్ కపుల్స్ మాత్రమే అక్కడికి వెళ్లాలి! మనం వెళ్లకూడదర్రా!'' తిప్పుకుంటూ అంది వెటకారంగా.

అక్కడ చేరిన అందరూ పకాపకా నవ్వారు. పిల్లలు మళ్లీ గొడవ మొదలు పెట్టారు.

''మమ్మీ, స్విమ్మింగ్ పూలే! నేనూ వెళ్తానే''

''షటిలే''

''షటిల్ వద్దు. క్రికెట్ ఆడుదాం!''

''మమ్మీ, స్వి- మ్మింగ్- పూ-లే-''

''నోర్ముయ్యండిరా శని పీనుగుల్లారా!''

''మన ముఖాలకు హాలిడే రిసార్ట్సు కూడానా! ఇంట్లో పడి చావండిరా దరిద్రపు గొట్టు వెధవల్లారా!'' మొగుళ్ల వంక చురచుర చూస్తూ, ఇన్‌డైరెక్టుగా చురకలంటిస్తున్నారు. ఇదెక్కడి గొడవరా బాబు? మధ్యలో వీళ్ళు మనల్ని షంటుతున్నారని పాపం ఆ మొగుళ్లు వాపోయారు.

...ఇంతలో మళ్లీ ఫోను మోగింది. హాలిడే రిసార్ట్స్ వారు ఫోన్ చేశారు.

జానకమ్మగారు, ''మేమెవ్వరం రావడం లేదు. ఆ రూమేదో క్యాన్సిల్ చేయించండి '' అంది.

ఈ మాటలను విన్న జానకి రామయ్యగారు తన మీద బాంబు పడ్డట్లు అదిరిపడ్డారు. మొగం వేలాడేసుకుని చూస్తుండిపోయారు.

''ఒకసారి బుక్ చేశాక కాన్సిల్ చేయడానికి వీలు పడదు మామ్మగారూ!'' అవతలి వారు మొత్తుకుంటున్నారు.

''ఇదెక్కడి చోద్యం? మేం వచ్చినా రాకపోయినా మీ బిల్లు మీకు కట్టాలా? ఏం రూల్స్, మీ బోడి రూల్స్! మీ బాస్‌ని పిలువు! ఆ బాస్‌తో నే మాటాడుతా'' అంటూ దడదడలాడించింది.

స్వల్ప విరామం...

ఈ లోపల, ''మనం వెళ్దాం జానకమ్మా! థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' జా.రా. గారు గునుస్తూ అన్నారు.

''మీరు విష్ణు సహస్ర నామాలు చదువుకుంటూ, నేను దీపం వత్తులు చేసుకుంటూ కూచుందాం. అదే థ్రిల్లింగు! ఆ పిచ్చి సన్నాసి తెలిసీ తెలియక చేస్తే తగుదునమ్మా అంటూ మనం వెళ్తామా! ఈ మాట అనడానికి సిగ్గు లేదూ?'' కోపంగా అంది.

పాపం, ఆయన చిన్నబుచ్చుకున్నారు ఆ మాటకు. వాళ్ల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు లైన్లోకి వచ్చాడు. మళ్లీ అతన్తో వాదోపవాదాలూ, తర్జనభర్జనలూ..చివరికీమే దిగి వచ్చి, ''...అయితే ఒక పనెయ్యరా అబ్బీ! కొత్తగా పెళ్లయిన మా అమ్మాయి అల్లుడూ వచ్చే నెలలో ఇక్కడికి వస్తున్నారు. జనవరి ఇరవై ఆరు వాళ్ల మేరేజ్ డే. అప్పుడు వాళ్లుంటారు. అప్పటి దాకా ఆ రూమ్ అట్టే పెట్టు'' అంది. దీంతో కోడళ్ల ముఖాలు మాడిపోయాయి.

''చూశావా! ఎదురుగా వున్న కొడుకులూ కోడళ్లు ఈవిడగారి కళ్లకు ఆనలేదు. ఎక్కడో వుండి, ఎప్పుడో వచ్చే కూతురు అల్లుడి కోసం రిజర్వు చేయించింది మహా తల్లి!''

''ఒక కంట్లో బెల్లం, ఒక కంట్లో సున్నం అంటే ఇదే మరి'' పక్కకు చేరి అత్తగారిని ఆడిపోసుకుంటున్నారు.

''చెల్లాయి కోసం పెండింగ్‌లో పెట్టకపోతే మీ ఫ్యామిలీనో, మా ఫ్యామిలీనో వెళ్లమనొచ్చు కదా! కోడళ్లు అంటారంటే అనరా మరీ. ఈవిడగారు చేసే పనులన్నీ ఇలాగే వుంటాయి'' కొడుకులు కూడా కినుకబూనారు. 'ఇంత' మొగం చేసుకున్నారు.

చిన్న కోడలు చిత్రాంగి. కోస్తా పిల్ల. ''అయ్యో, ఇప్పుడెలా అత్తయ్య గారూ! మీరా రిట్రీట్‌కేదో వెళ్తున్నారని మీకోసం వండిన కూరలు పనిమనిషికి ఇచ్చేశానే! నువ్వూ ఇచ్చేశావా అక్కయ్యా!'' అంది నర్మగర్భంగా.

పెద్దకోడలు తెలంగాణా పిల్ల '' ఔ ఔ'' అంది.

''మరేం దిగులులేదు. పది నిమిషాల్లో నేను వండేస్తా'' అంది జానకమ్మ.

''మమ్మీ! స్వి..మ్మి..ంగ్..పూలే!''

''మమ్మీ! షటిలే''

''దరిద్రపు మొఖాల్లారా!'', ''శని పీనుగుల్లారా'' పిల్లల్ని బాదుకుంటూ కిందకు ఈడ్చుకు పోయారు. ఇంటి వాతావరణం గంభీరంగా మారి పోయింది.

* * *

జరిగిందంతా పెద్ద కొడుకు 'చాటింగ్'లో అమెరికాకు చాటింపు వేశాడు.

పాపం, అప్పుడు వంట చేసుకుని ఇంత కతికి ముసలివాళ్లిద్దరూ అట్టా నడుం వాల్చారో లేదో ఇంతలోనే కాలింగ్‌బెల్ మోగింది.

జానకి రామయ్య గారు తలుపు తీయడానికి లేచారు. ఒక పెద్ద పాకెట్ చేత్తో పట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తిరిగి వచ్చారు.

''మళ్లీ అదేంటండీ బాబు?'' ముసలామె అంది.

''మన మేరేజ్ డే కేకే చిట్టీ! ఈ న్యూలీ మేరీడ్ కపుల్స్‌కు చిన్నోడు అమెరికా నుంచి పంపించాడు''


''చిన్నోడు మళ్లీ ఇదొక కుమ్మరాం పెట్టాడా?'' విసుగ్గా అంది.

డీలక్స్ రూమ్ అట్టా అయిందని మళ్లీ ఇదొకటి పంపించి వుంటాడు. వీడు ఏదైనా తలబెడితే అది అయ్యేదాకా వూరుకోడుగదా అనుకుంది.

''ముసలాళ్లు మేరేజ్‌డే కేక్ కట్ చేస్తోన్నారోయ్'' అంటూ మళ్లీ ఇల్లంతా కలకలం రేగింది.

''కేక్ కటింగ్..కేక్ కటింగ్'' అని అరుస్తూ పిల్ల మూక పోలోమంటూ మళ్లీ పైకి వచ్చారు. ఇల్లంతా సందడిసందడిగా వుంది.

సాయంత్రం అయిదు అవగానే జానకిరా



మయ్య స్నానం చేసి, చారల టీషర్ట్ వేసి నీట్‌గా తయారైపోయాడు.

చిటికెలు వేసుకుంటూ, ''కాదు సుమా కల కాదు సుమా''అని పాత సినిమా పాటను కులాసాగా పాడుకుంటూ ఇల్లంతా హడావిడిగా తిరుగుతున్నాడు. పిల్ల మూక ఆయనతో కలిశారు.

హాల్లో సెంటర్లో తివాచీ పరిచారు. దాని సెంటర్లో టీపాయ్ పెట్టారు. దాని మీద అల్లిక గుడ్డను పరిచారు. ఫ్లవర్ వాజ్ పెట్టారు. చుట్టూ కుర్చీలు వేస్తున్నారు.

ఈ మనిషి ఎటూ వదిలేట్లు లేడని జానకమ్మ గారూ కూడా సాయంత్రం కార్యక్రమానికి సంసిద్ధమవుతోంది.

కింద మరో సీన్ నడుస్తోంది.

కొడుకులూ కోడళ్ళూ దేనికో మల్లగుల్లాలు పడుతున్నారు. అమ్మా నాన్నలకు మన ఖర్చుగా చెరొక పూలదండ కొందాం అని కొడుకులు అనుకుంటున్నారు.

ఈ మాటలు ఏదో పని మీద కిందకు వచ్చిన జానకమ్మ గారి చెవిన పడ్డాయి. ఆమె మనసు చివుక్కుమంది. రెండగడుగులు ముందుకేస్తే ఆ పక్క గదిలోంచి కోడళ్ల మాటలు వినిపించాయి.

''ఈ మగమోఖాలకి సిగ్గెక్కడలేదంట? అమ్మా నాన్నలకు దండలు కొంటారంట. ఈ ముసలాళ్లు పూలహారాలు మార్చుకుంటే మనం తిలకాలు దిద్ది, మంగళ హారతులిచ్చి, పాదాభివందనాలు చేయాలా? ఈ దండగమారి మనుషులకు పూల దండలు కూడా దండుగే''

కొడుకుల మాటలకు చివుక్కుమన్న మనస్సు కోడళ్ల మాటలకు విరిగిపోయింది.

* * *

పైన హాలులో ఒక పెడగా జానకమ్మ గారు నేల మీద చతికిలపడి కూర్చున్నారు. ఆమె ముందు ముక్కాళ్లపీట వుంది. ఆ పీట మీద చిన్న కొడుకు పంపిన మేరేజ్ కేక్ ఉంది.

ఒక వైపు జానకి రామయ్య గారూ, మరో వైపు పిల్లలూ వారిస్తోన్నా వినకుండా ఆమె తనపాటికి తాను ఒక చాకు తీసుకుని ఆ కేకుకు నాజుగ్గా గంట్లు పెడుతోంది. ముసలాయన ముఖం చిన్నబోయింది, చిన్నారుల ముఖాలు బిక్కబోయాయి.

కారుమబ్బులు కమ్మిన ఆకాశంలాగా ఆ హాలు గంభీరంగా, భారంగా వుంది. మబ్బుల్లో మెరిసే మెరుపుల్లాగా ఆమె మాత్రం వుండి వుండి చిన్నగా తనలో తాను నవ్వుకుంటోంది.

కోసిన కేకు ముక్కల్ని పేపరు ప్లేట్లలో పెట్టి అందరి చేతుల్లో పెడుతోంది. ముందుగా ప్లేటు అందుకుంది,కేకు ముక్కను గుటుక్కుమని మింగింది ముసలాయనే. ముందుగా బడబడా నవ్వింది ముసలాయనే!

ఆ తర్వాతనే పిల్లలందరూ బొలబొలా నవ్వేరు. ముసిరిన మబ్బులు చెదిరిపోయి నవ్వుల వెన్నెలలు కాశాయి.



మళ్లీ మళ్లీ చేతులు చాపుతూ ఇంట్లో పిల్లలూ, ఇరుగుపొరుగు పిల్లలూ ముసలామె చుట్టూ మూగారు. అప్పుడే పైకి వచ్చిన కొడుకులిద్దరూ ఈ దృశ్యాన్ని విస్మయంగా చూస్తూ గుమ్మం దగ్గరే నిల్చుండిపోయారు. వారికప్పుడు తమ చిన్నప్పటి రోజులు గుర్తుకువచ్చాయి.

ఆదివారప్పూట తమ ఇంట్లో గంగానమ్మను పెట్టి పూజచేసి, నైవేద్యంగా పెట్టిన చలిదన్నం, కుడుముల్ని నట్టింట కూర్చుని ఇంట్లో పిల్లలకు, ఇరుగుపొరుగు పిల్లలకు ఫలహారంగా చేతుల్లో పెడుతుండే తల్లి కళ్లముందు మెదిలింది.

ఇద్దరికిద్దరూ చలించిపోయారు. మళ్లీ చిన్నతనం చిగురించింది. ఈ ముదిరి గుండెలు మళ్లీ ఆ లేత గుండెలుగా మారాయి.

తల్లి ముందు నేల మీద చతికిలపడి కూర్చున్నారు. ఆ పిల్లల్లో పిల్లలయ్యారు. అమ్మ ముందు చేతులు చాపారు. ఆ చాచిన చేతుల్లో ఆమె ప్రేమగా కేకు ముక్కలు పెట్టింది. ఇద్దరికీ కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి.

''అట్లా చూస్తోన్నారేంటయ్యా తినండ్రా!'' అంది.

ఇద్దరూ తలలు వాల్చి తల్లి పాదాలకు మోకరిల్లారు. అమ్మ పాదాలకు రాసుకున్న పసుపు వాసన కమ్మగా వుంది. ఆమె కొడుకుల తల మీద చేయ్యేసి ప్రేమగా నిమురుతోంది.

ఇది చూసి కోడళ్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

★